# పాపం.. యంత్రాంగం!

**చంద్రబాబు నియోజకవర్గానికి నీళ్లిచ్చామని చెప్పుకునేందుకు సర్కారు ఆపసోపాలు ● హంద్రీ-నీవా జలాలను నిలువరించేందుకు అధికారుల పాట్లు**




ఉదయం.. రాజుపేట వద్ద కాలువగేటు పైభాగం నుంచి ప్రవహిస్తున్న జలాలు

సాయంత్రానికి ఇలా..

రామకుప్పం, ఫిబ్రవరి 25: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పానికి నీళ్లిచ్చామని చెప్పుకునేందుకు వైసీపీ చేసే ప్రయత్నాలు అధికారులకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. రామకుప్పం మండలం రాజుపేట వద్ద హంద్రీ-నీవా జలాలను నిలువరించడానికి అధికారులు ఆపసోపాలు పడుతున్నారు. సోమవారం సీఎం జగన్.. రాజుపేట వద్ద హంద్రీ-నీవా కాలువగేట్‌ను ఎత్తి జలాలను విడుదల చేయనున్నారు. ఈనేపథ్యంలో రెండు రోజుల కిందట వి.కోట మండలం ఆదినపల్లె లిఫ్ట్ పాయింట్ నుంచి నీళ్లను వదిలారు. ఆ జలాలు ఆదివారం సాయంత్రానికి రాజుపేట వద్దకు చేరుతాయని అధికారులు భావించగా, శనివారం రాత్రికే చేరుకున్నాయి. జలప్రవాహం ఎక్కువగా ఉండటంతో రాజుపేట హంద్రీ-నీవా గేట్‌కు ఎగువ ప్రాంతంలో మట్టితో వేసిన అడ్డుకట్ట తెగిపోయింది. దీంతో గేట్ పైభాగంగా నుంచి జలాలు గేట్‌ను దాటుకుంటూ ముందుకు ప్రవహించాయి. సీఎం గేట్‌ను ఎత్తి జలాలను విడుదల చేయకముందే జలాలు ముందుకు సాగాయి. ఇక్కడ గేట్‌ను రెండు రోజుల కిందటే ఏర్పాటు చేయడంతో ఒక దశలో గేట్ కొట్టుకుపోతుందన్న ఆందోళన అధికార యంత్రాంగాన్ని కలవరానికి గురి చేసింది. వెంటనే అప్రమత్తమైన అధికారులు ఆదినపల్లె లిఫ్ట్ యూనిట్ వద్ద మోటార్లను ఆపు చేయించారు. సోమవారం తెల్లవారు జామున మోటార్లను ఆన్ చేసి జలాలను రాజుపేటకు చేరేలా ప్లాన్ చేస్తున్నారు.



ఉదయం.. కాలువ గేటు పైభాగంలో తెగిపోయిన అడ్డుకట్ట



మధ్యాహ్నానికి ఇలా..

## టీడీపీ హయాంలోనే పూర్తయిన 80 శాతం పనులు

2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కెనాల్ ప్రాజెక్టుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నియోజకవర్గంలో సాగు, తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కారించాలన్న తలంపుతో అప్పట్లో కుప్పం మండలం పరమసముద్రం చెరువు వరకు చేరేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మార్గంలో రామకుప్పం, శాంతిపురం, గుడుపల్లె, కుప్పం మండలాల్లోని పలు పెద్దచెరువులను హంద్రీ-నీవా జలాలతో నింపాలన్న బృహత్ ప్రణాళికతో 2016లో పనులు ప్రారంభించింది. 2019నాటికి 80శాతం పనులు పూర్తయ్యాయి. 2019 ఎన్నికలకు ముందు హంద్రీ-నీవా జలాలు వి.కోట మండలం కృష్ణాపురం వరకు వచ్చాయి. వి.కోట, రామకుప్పం, శాంతిపురం మండలాల పరిధిలో వైసీపీ నేతల ప్రోద్బలంతో కొందరు రైతులు కోర్టులకు వెళ్లడంతో అక్కడక్కడా కాలువ తవ్వకం పనులు చేపట్టలేకపోయారు. 2019 తర్వాత కోర్టు సమస్యలు పరిష్కారమయ్యాయి. 2019 ఎన్నికల్లో వైసీపీ గెద్దనెక్కడంతో హంద్రీ-నీవా పనులు స్తంభించాయి. నాలుగేళ్ల పాలనలో స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా ప్రముఖులతోపాటు రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు కూడా మిగిలిన 20శాతం పనులు పూర్తి చేయాలన్న విషయాన్ని పట్టించుకోలేదు. 2022లో కుప్పం పర్యటనకు వచ్చిన సీఎం జగన్ ఆరు నెలల్లో హంద్రీ-నీవా కుప్పం కెనాల్ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అయినా పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుతం ఎన్నికలు ముంచుకొస్తుండటంతో హడావిడిగా పనులు పూర్తి చేశారు. అయినా అక్కడక్కడా గుట్టలను తొలిచి కాలువ తవ్వారు. అటువంటి చోట జలాలు బండల నెర్రెల మధ్య భూమిలోకి వెళ్తున్నాయి. దీంతో పూర్తి స్థాయిలో జలాలు ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం రాజుపేటకు చేరుకుంటున్న జలాలు ఎంత దూరం సాగుతాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది.

● అట్టుంటనా!

## యాలప్పా అగ్గవ మాటలు?



'ఒక మాట అడగతా చెప్తావా?'
'అడుక్కో మావా... యాల ఎనకాడేది?'
ఏంలేదు బావా, మీ ఊరికి హంద్రీ-నీవా నీళ్లు వొచ్చినాయా?
రేత్రి ఏమన్నా కలగాన గన్నావా యేంది.. మా ఊరికి నీళ్లొచ్చినట్టు'
'నేను కొచ్చినీ యేస్తే.. మళ్ల నువ్వే నాకు కొచ్చినీ యేస్తే ఎట్టబ్బా.. చెప్పు ఆ నీళ్లు వొచ్చినాయా?'
'అప్పుడే యాడినింకా వొస్తాయి మావా. ఇంకా సీఎం ప్రారంభించలేదుగదా.?'
'సరే, ఈరోజు ప్రారంభిస్తావుండారు గదా హంద్రీనీవాను. అప్పుడైనా వొస్తాయని నమ్మకం ఉండాదా బావా?'
' బలేటోడివే లే నువ్వు... ఎట్టా వొస్తాయి చెప్పు. రామకుప్పం మండలం రాజుపేట రోడ్డు వరకూ మాత్రం కాలవలో నీళ్లు వచ్చేది గ్యారంటీ. మొన్న ట్రయల్ రన్ చేసినప్పుడు అక్కడినింకా నాలుగైదు కిలోమీటర్లు దూరంలో ఉండే గుండిశెట్టిపల్లె దాకానే రాలేదు నీళ్లు.'
'కదా బావా. ఆ రాజుపేట దెగ్గిర కాలవలో గూడా మూడునాలుగు రోజులకే ఎండిపాయెనే. కుప్పం నియోజకవర్గం మొత్తంగా 54 చెరువులను హంద్రీ-నీవా నీళ్లతో నింపేస్తానంటా ఉండాడే మంత్రిగారు?'
'పెద్దోళ్ల మాటలు మనకెందుకులే మావా.'
'అదిగాదు బావా. మనోడివనే గదా నిన్ను అడగతా ఉండేది. ఇంకో దెగ్గిరైతే నోరు తెరిచేవాడినా జెప్పు. ఇంకో ఇచ్చిత్రపు మాట గూడా చెప్పినాడు మంత్రి'
'యేందా ఇచిత్తరపు మాట?'
'పాలారు ప్రాజెక్టు నిర్మాణం గూడా పూర్తి చేసేస్తారంట'.
'తమిళనాడు కోర్టుకు ఏసింది గదా. అదిగూడా గాదు. రేపు నెల్లోనే గదా ఎలచ్చన్లు. ఆలోగానే ప్రాజెక్టు కట్టేస్తాడంటనా ఈయప్ప'
'మంత్రి తలచుకుంటే ప్రాజెక్టులకు కొదవా మావా?'
'అదేందో సామెత ఉండాది బావా. ఉట్టికెక్కలేనమ్మ...'
'గమ్మునుండు సామీ. మనకెందుగ్గానీ అగ్గవ మాటలు! ఇడిసిపెట్టు. అమ్మవొడి డబ్బులు పడినాయంటనా మీ ఆడోళ్ల అకౌంట్లో'
'నాకు జెప్తాదా యేంది? పడినట్లే అనుకోని దాని దెగ్గిర ఏ కాసు లుంటే ఆ కాసులు పెరుక్కోని వొచ్చెయ్యడమే.'
'సరే పద మావా, నాలుక పీకతా ఉండాది.'

\- కుప్పం

ముఖ్యమంత్రి పర్యటనకు

## సర్వం సిద్ధం

రామకుప్పం/శాంతిపురం, ఫిబ్రవరి 25: ముఖ్యమంత్రి జగన్ కుప్పం నియోజకవర్గంలో సోమవారం పర్యటించనున్నారు. దీనికోసం అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. రామకుప్పం మండలం రాజుపేట, గుండిశెట్టిపల్లె వద్ద హెలిప్యాడ్లను సిద్ధం చేశారు. రాజుపేట హంద్రీ-నీవా కాలువ గేట్ ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. గుండిశెట్టిపల్లె సమీపంలో సీఎం సభాస్థలి, వేదికలు సిద్ధమయ్యాయి. రెండు ప్రాంతాల్లో వివిధ శాఖల ఫొటో ఎగ్జిబిషన్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏర్పాట్లను మంత్రి పెద్దిరెడ్డి, కలెక్టరు షన్మోహన్, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ తదితరులు పరిశీలించారు.

**పర్యటన ఇలా..**

ఉదయం 9.45 గంటలకు సీఎం తిరుపతి విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి రాజుపేటకు చేరుకుంటారు. స్థానిక ప్రజాప్రతినిధులతో కాసేపు మాట్లాడి, 10.30 గంటలకు పూజాస్థలానికి చేరుకుంటారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించాక హెచ్ఎన్ఎస్ఎస్ నీటిని విడుదల చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారు. 11.05 నిమిషాలకు హెలికాప్టర్‌లో బయలుదేరి శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లెకు చేరుకుంటారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించాక కొత్త చెరువుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారు. 11.45 నుంచి మధ్యాహ్నం 1.10 వరకు బహిరంగసభలో పాల్గొంటారు. హెలిప్యాడ్ వద్ద స్థానిక నాయకులతో మాట్లాడి.. హెలికాప్టర్‌లో తిరుపతి విమానాశ్రయానికి బయల్దేరుతారు.



రాజుపేట వద్ద హంద్రీ-నీవా కాలువను పరిశీలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, కలెక్టరు షన్మోహన్ తదితరులు

**ఇచ్చిన హామీ మేరకు కుప్పానికి హంద్రీ-నీవా జలాలు : మంత్రి**

2022లో కుప్పం పర్యటనకు వచ్చిన సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు కుప్పానికి హంద్రీ-నీవా జలాలను అందిస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. ఆదివారం శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లెలో ఆయన మీడియాతో మాట్లాడారు. పాలారు ప్రాజెక్టుకు కూడా శంకుస్థాపన చేస్తారన్నారు.

**ఆరు కిలోమీటర్లు.. రెండు హెలిప్యాడ్లు**

రాజుపేట నుంచి గుండిశెట్టిపల్లె మధ్య దూరం ఆరు కిలోమీటర్లే ఉంది. అయినా అధికారం యంత్రాంగం రాజుపేట, గుండిశెట్టిపల్లెలో ఒక్కోటి చొప్పున రెండు హెలిప్యాడ్లు ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది.

# ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు

**7,977 మంది అభ్యర్థుల హాజరు**



చిత్తూరులో అభ్యర్థిని తనిఖీ చేస్తున్న పోలీసులు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 25: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమీషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాలో గ్రూప్-2 (ప్రిలిమ్స్ ఆబ్జెక్టివ్ టైప్ (స్క్రీనింగ్) పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. చిత్తూరు, బంగారుపాళ్యం, పలమనేరు, పూతలపట్టు ప్రాంతాల్లోని 20 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు డీఆర్వో పుల్లయ్య నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను అనుమతించలేదు. 9,411 మంది అభ్యర్థులకుగాను 7,977 మంది హాజరువగా, 1434 మంది గైర్హాజరయ్యారు. జేసీ శ్రీనివాసులు.. ఎస్వీసెట్, అపోలో మెడికల్ కాలేజ్ పరీక్షా కేంద్రాలను, డీఆర్వో పుల్లయ్య.. పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సీటమ్స్ ఇంజనీరింగ్ కళాశాల, ఏపీపీఎస్సీ ప్రతినిధులు వెంకటరమణ, ఆంజనేయులు పలు కేంద్రాలను తనిఖీలు చేశారు.




కోడెగిత్తలను నిలువరిస్తున్న యువకులు

# రంకేసిన కోడెగిత్తలు

**పెరుమాళ్లపల్లెలో వైభవంగా జల్లికట్టు**

వెదురుకుప్పం, ఫిబ్రవరి 25: వెదురుకుప్పం మండలం పెరుమాళ్లపల్లెలో ఆదివారం జల్లికట్టును వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కోడెగిత్తల కొమ్ములకు వివిధరకాల పట్టీలను కట్టి అల్లిలో వదిలారు. ఈ కోడెగిత్తలను యువకులు నిలువరించి, పట్టీలు దక్కించుకున్నారు. ఈ క్రమంలో కొందరి మధ్య వాగ్వాదాలు జరిగాయి. మరికొందరు గాయపడ్డారు. వీక్షించడానికి వచ్చిన జనంతో గ్రామం కిటకిటలాడింది.

# విద్యుదాఘాతంతో కూలీ మృతి

## మరొకరికి తీవ్రగాయాలు



అంజాద్ షరీఫ్ మృతదేహం

గంగవరం, ఫిబ్రవరి 25: విద్యుదాఘాతంతో ఓ కూలీ మృతి చెందాడు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం శ్రీనివాసపురానికి చెందిన అంజాద్ షరీఫ్ (45), ఆలీపాషలు కూలి పనులు చేసుకుని, జీవనం సాగించేవారు. ఈ క్రమంలో గంగవరం మండలంలోని మల్లేరు వద్ద పుచ్చకాయల లోడింగ్ చేయాలని, కోలారు నుంచి ఓ వ్యానులో వీరిద్దరూ వచ్చారు. గ్రామం పక్కనే ఉన్న వ్యవసాయ పొలాల్లో పుచ్చకాయలు లోడింగ్ చేసుకొని, వ్యానుపై కూర్చొని తిరుగు ప్రయాణమయ్యారు. ప్రమాదవశాత్తూ విద్యుత్ తీగలు తగిలి ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, రైతులు గమనించి బాధితులను చికిత్స నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే అంజాద్ షరీఫ్ మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ఆలీపాషాకు చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న మృతుడి బంధువులు ఆస్పత్రికి చేరుకుని బోరున విలపించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంగవరం పోలీసులు తెలిపారు.

# రేపటినుంచి టెట్

**చిత్తూరులో నాలుగు, చెన్నైలో రెండు పరీక్ష కేంద్రాలు**

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 25: విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏపీ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్టు (టెట్) మంగళవారం నుంచి మార్చి 6వ తేదీ వరకు చిత్తూరు, చెన్నైలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో నిర్వహించనున్నారు. టెట్ పరీక్షల కోసం అభ్యర్థుల నమోదు గడువు ఆదివారంకు పూర్తి కానుంది. పరీక్షల నిర్వహణకు చిత్తూరు జిల్లాలో నాలుగు, చెన్నైలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు జరగనున్నాయి. అభ్యర్థులు కేటాయించిన కేంద్రాలకు గంట ముందుగా చేరుకోవాలని డీఈవో దేవరాజు సూచించారు. సందేహాలకు 82478 38357, 73864 08270, 94404 58098 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

**పరీక్ష కేంద్రాలిలా..**

జిల్లాలో.. మదర్ థెరీసా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (పలమనేరు), శ్రీవెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (చిత్తూరు), వేమూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (పి.కొత్తకోట - చిత్తూరు) శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (చిత్తూరు), చెన్నైలో.. ఐఓఎన్ డిజిటల్ జోన్ ఐడీజెడ్ (కోవిలంబాకం), ఎస్ఐవీఈటీ కాలేజ్ (వేళచ్చేరి) సెంటర్లు ఏర్పాటు చేశారు.

# నేడు కలెక్టరేట్‌లో 'స్పందన' రద్దు

చిత్తూరు, ఫిబ్రవరి 25: కలెక్టరేట్‌లో సోమవారం జరగనున్న స్పందన కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ షన్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.సీఎం జిల్లా పర్యటన ఉండటంతో అధికారులంతా ఆ కార్యక్రమాల ఏర్పాట్లలో ఉండటంతో రద్దుచేశామని పేర్కొన్నారు.

**ఎస్పీ కార్యాలయంలోనూ..**

జిల్లా పోలీసు కార్యాలయంలోనూ సోమవారం స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్, ఎస్పీ కోరారు.

# ఎన్నికలపై తహసీల్దార్లకు మూడో విడత శిక్షణ

**తిరుపతిలో నేటినుంచి మార్చి 1వరకు నిర్వహణ**

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 25: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై తహసీల్దార్లకు సోమవారం నుంచి మార్చి ఒకటో తేదీవరకు మూడో విడత శిక్షణ తరగతులు జరగనున్నాయి. తిరుపతి పద్మావతి మహిళా యూనివర్సిటీ క్యాంపస్‌లో రెండు విడతల శిక్షణ పూర్తయ్యింది. మూడో విడతలో కుప్పం, పలమనేరు మున్సిపల్ కమిషనర్లు, చిత్తూరు కేఆర్‌సీసీ స్పెషల్ తహసీల్దార్, సోమల, సదుం, వెదురుకుప్పం, చిత్తూరు, యాదమరి, బంగారుపాళ్యం, పెద్దపంజాణి, గంగవరం, పలమనేరు, బైరెడ్డిపల్లె, వి.కోట, కుప్పం, శాంతిపురం, రామకుప్పం, గుడుపల్లె మండలాల తహసీల్దార్లు హాజరుకానున్నారు. నామినేషన్ల స్వీకరణ నుంచి ఓట్ల లెక్కింపు వరకు అధికారులకు శిక్షణ ఇస్తారు.

## జింకపై కుక్కల దాడి

● రక్షించిన స్థానికులు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 25: చిత్తూరు నగరంలోని అటవీ ప్రాంతం నుంచి దారి తప్పి ఓ జింక ఆదివారం గిరింపేటలోని పాత కలెక్టరేట్ వద్దకు చేరుకుంది. దానిపై అక్కడి వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. గమనించిన స్థానికులు కుక్కల బారి నుంచి జింకను రక్షించి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. తూర్పు అటవీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పశువైద్యాధికారులతో జింకకు వైద్యసేవలు అందించి, సురక్షితంగా అటవీ ప్రాంతానికి చేర్చారు. జింకను కాపాడిన స్థానికులకు తూర్పు ఫారెస్టు రేంజ్ అధికారి థామస్ కృతజ్ఞతలు తెలిపారు.

## కుక్కల దాడిలో గాయపడిన దుప్పి


గాయపడిన దుప్పికి చికిత్స చేస్తున్న పశువైద్యులు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 25: దారి తప్పి ఓ దుప్పి గ్రామ సమీపానికి రావడంతో ఆదివారం ఊరి చివర్లోని కుక్కలు దానిపై దాడిచేసి గాయపరిచాయి. ఈ సంఘటన మండలంలోని జంబువారిపల్లె పంచాయతీ దండువారిపల్లెలో చోటుచేసుకుంది. గాయపడిన దుప్పిని గ్రామస్తులు రక్షించి ఫారెస్టు అధికారులకు సమాచారం అందజేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు ఆ దుప్పిని చికిత్స నిమిత్తం నలగాంపల్లె పశువైద్యశాలకు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో శివకుమార్, ఎఫ్‌బీవోలు ప్రతాప్, పద్మావతి, ఏబీవో సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## సీఎం పర్యటనలో పొరపాట్లు జరగరాదు


విమానాశ్రయంలో అధికారులతో సమీక్షిస్తున్న జేసీ, ఎస్పీ

రేణిగుంట, ఫిబ్రవరి25: ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి పొరబాట్లకు తావుండరాదని జేసీ శుభంబన్సల్, ఎస్పీ మలికాగర్గ్ అధికారులను ఆదేశించారు. సీఎం జగన్ సోమవారం మోహన్‌రెడ్డి చిత్తూరు జిల్లా పర్యటనకు రానున్నారు. ఇందుకోసం సోమవారం ఉదయం 9.35 గంటలకు సీఎం విమానాశ్రయం చేరుకుంటారు. 9.45 గంటలకు చిత్తూరు జిల్లాలో పర్యటనకు వెళతారు. సీఎం తన పర్యటన ముగించుకొని తిరిగి మూడు గంటలకు విమానాశ్రయం చేరుకుంటారు. 3.10 గంటలకు విమానాశ్రయం నుంచి గన్నవరం బయలుదేరి వెళతారు. ఈ క్రమంలో విమానాశ్రయంలో ఆదివారం ముందస్తు భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విమానాశ్రయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ సమావేశంలో ట్రైనీ ఎస్పీ పాటిల్‌దేవరాజ్‌మనీష్, శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, ఏఎస్పీలు కులశేఖర్, శ్రీనివాసరావు, అధికారులు శ్రీహరి, రవిప్రభు, రమణయ్య, విమానాశ్రయం అధికారులు పాల్గొన్నారు.

## ఉత్తుత్తి హామీలను నమ్మం: ఎస్టీయూ




సమావేశంలో ప్రసంగిస్తున్న మదన్‌మోహన్‌రెడ్డి

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 25: ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇస్తున్న ఉత్తుత్తి హామీలను తాము నమ్మే పరిస్థితుల్లో లేమని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఉద్యోగులను మభ్యపెట్టే విధంగా వేతన సవరణ కమిటీని నియమించి, కనీసం మధ్యంతర భృతి ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రధాన కార్యదర్శి మోహన్ మాట్లాడుతూ.. ఏకోపాధ్యాయ పాఠశాలల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న కష్టాలు వర్ణనాతీతమన్నారు. 117 జీవో తప్పనిసరిగా సవరించాలని, డీఎస్సీ నోటిఫికేషన్ సమీక్షించి 50వేల పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్టీయూ సీనియర్ నాయకులు గంటా మోహన్, పురుషోత్తం, జగన్మోహన్‌రెడ్డి, లోకనాథరెడ్డి, హేమచంద్ర, యువరాజ్, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.74 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.74 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 72,175 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా 29,543 మంది తలనీలాలు సమర్పించారు.



**ఎ**న్నికల నేపథ్యంలో అధికార పార్టీకి కావాల్సిన వారికి తాయిలాలు ప్రకటించేందుకు టీటీడీ సిద్ధమైంది. తిరుమలలోని అన్నమయ్య భవనంలో నేటి ఉదయం 10 గంటలకు జరిగే పాలకమండలి సమావేశంలో మూడు దశాబ్దాల కిందటే గడువు ముగిసిన తట్ట లైసెన్సులను పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అనుకూలుర షాపులకు ఒకచోట నుంచీ మరోచోటకు తరలించేందుకు అనుమతులు లభించనున్నాయి. ఉద్యోగులను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాల్లో భాగంగా 400మంది కాంట్రాక్టు ఉద్యోగులకు టైమ్ స్కేల్ వర్తింపజేయనున్నారు.ఇంజనీరింగ్ పనులకూ పెద్దఎత్తున అనుమతులు ఇవ్వనున్నారు.

-తిరుపతి,ఆంధ్రజ్యోతి

# టీటీడీ అజెండాలో ఎన్నికల తాయిలాలు!

### నేటి పాలకమండలి సమావేశం ముందుకు పలు కీలక అంశాలు

### 30 ఏళ్ళ క్రితం గడువు ముగిసిన తట్ట లైసెన్సుల పునరుద్ధరణ

**తి**రుమలలో దుకాణాలు కాకుండా రోడ్ల పక్కన వ్యాపారాలు చేసుకునే హాకర్లకు టీటీడీ తట్ట లైసెన్సులు జారీ చేసే విషయం తెలిసిందే.వీటికి విపరీతమైన డిమాండ్, విలువ వుంది. లైసెన్సులు తీసుకున్న వారు అనధికారికంగా ఇతరులకు రోజువారీ లేదా నెలవారీ సబ్ లీజులకు ఇచ్చి లక్షలు సంపాదిస్తుంటారు. కీలక ప్రాంతాలు, కూడళ్లలో వీటి అద్దెలు ఊహించలేని విధంగా వుంటాయి. 1987 నుంచీ 1993 మధ్య గడువు ముగిసిన సుమారు 162 తట్ట లైసెన్సులను పునరుద్ధరించే అంశాన్ని ప్రస్తుత సమావేశ అజెండాలో చేర్చినట్టు సమాచారం. ఇందులో 90 వరకూ లైసెన్సులను వైసీపీకి సంబంధించిన వారు కొనుగోలు చేశారని, వారి పేరిట తాజాగా సంబంధిత లైసెన్సులను పునరుద్ధరించేందుకు యత్నిస్తున్నారని సమాచారం. రానున్న ఎన్నికల్లో అధికార పార్టీకి ఉపయోగపడే కీలక వ్యక్తులకు ఈ సాయం చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.తిరుమల కొండపై తట్ట లైసెన్సులతో పోలిస్తే వంద రెట్లు అధిక విలువ, డిమాండ్ దుకాణాలకు వుంటుంది. తిరుమలలో టీటీడీ నుంచీ షాపులు పొందిన వారిలో అధికశాతం యజమానులు భారీ మొత్తాల్లో అడ్వాన్సులు, అద్దెలు తీసుకుని ఇతరులకు అప్పగిస్తుంటారు. యాత్రికుల రద్దీ అధికంగా వుండే ప్రాంతాల్లోనూ, కీలక కూడళ్లలోనూ వుండే షాపుల విలువ అపారంగా వుంటుంది. అక్కడ షాపుల అడ్వాన్సులు, అద్దెలు సామాన్యుల ఊహాకందవు. యాత్రికుల సందడి తక్కువగా వున్న ప్రాంతాల్లోని షాపుల యజమానులు తమ షాపులను అనువైన చోటకు తరలించుకునేందుకు ఎంత భారీ మొత్తాలైనా చెల్లించేందుకు సిద్ధపడతారు. అయితే దానికి కూడా పైస్థాయి రాజకీయ సిఫారసుతో పాటు భారీ మొత్తాలు సమర్పించుకుంటే గానీ పనులు జరగవు. నేటి పాలకమండలి సమావేశంలో 14 షాపులను ఒక చోట నుంచీ మరోచోటకు తరలించే అంశాన్ని అజెండాలో పొందుపరిచినట్టు సమాచారం. ఇవన్నీ కూడా అధికార పార్టీ ముఖ్యనేతలకు బాగా కావాల్సిన వారివని సమాచారం.

### నెలలోపే పాలకమండలి రెండో భేటీ

**టీ**టీడీ పాలక మండలి సమావేశం చివరగా గత నెల 29వ తేదీన జరిగింది. సాధారణంగా పాలక మండలి సమావేశాలు రెండు నెలలకు ఓమారు జరుగుతాయి. అయితే నెలలోపే రెండోసారి సమావేశం ఏర్పాటు కావడంతోనే అందరి దృష్టీ సమావేశంవైపు, అజెండా వైపూ మళ్ళుతోంది. ఎన్నికల నేపథ్యంలో రాజకీయ ప్రయోజనాలు పొందే విధంగా నిర్ణయాలు తీసుకునేందుకే ఈ సమావేశం జరుగుతోందన్న ఆరోపణలకు ఇది బలం చేకూర్చేలా వుంది. మరోవైపు ఎన్నికలయ్యాక ప్రస్తుత ప్రభుత్వం తిరిగి వస్తుందో రాదోనన్న అనుమానం వుండడం వల్లే తమ ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే ఉద్దేశంతోనే నెలలోపే రెండో సమావేశం ఏర్పాటు చేస్తున్నారన్న ప్రచారమూ జరుగుతోంది.

### 400 మంది కాంట్రాక్టు ఉద్యోగులకు టైమ్ స్కేల్

టీటీడీలోని పలు విభాగాల్లో పనిచేస్తున్న సుమారు 400 మంది కాంట్రాక్టు ఉద్యోగులకు టైమ్ స్కేల్ వర్తింపజేసే అంశం కూడా అజెండాలో వున్నట్టు సమాచారం. ఇంజనీరింగ్ విభాగంలో, వాటర్ వర్క్స్, ప్రెస్ పబ్లికేషన్స్ విభాగం వంటి వాటిల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న ఈ ఉద్యోగులకు ప్రస్తుతం 14 వేల వరకూ వేతనం అందుతోంది. వీరికి టైమ్ స్కేల్ వర్తింపజేస్తే ఏకంగా వేతనం రూ. 30 వేల వరకు పెరగనుంది.

### భారీగా ఇంజనీరింగ్ పనులకు అనుమతులు

టీటీడీ ఇంజనీరింగ్ కాంట్రాక్టు పనులను ఆదాయ వనరుగా మార్చుకున్న అధికార పార్టీ ముఖ్యనేత పాలక మండలిని అడ్డుపెట్టుకుని భారీగా పనులకు అనుమతులు జారీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్టు సమాచారం. ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో ఇంజనీరింగ్ పనులు పెద్దఎత్తున ప్రతిపాదించి వాటికి అనుమతులు జారీ చేయడం ద్వారా పర్సంటేజీలు వసూలు చేసుకునే ప్రయత్నం జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## పట్టపగలే దారుణ హత్య

● సోదరుడిపైనే అనుమానం




మృతుడు చంద్రశేఖర రెడ్డి

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 25:పట్టపగలే... నడిరోడ్డుపై ఓ వ్యక్తిని అటకాయించి... పారిపోతుండగా వెంటాడి కత్తులతో దారుణంగా నరికి చంపిన ఘటన తిరుపతి రూరల్ మండలంలో ఆదివారం జరిగింది.పోలీసుల కథనం మేరకు... ఎర్రావారిపాలెం మండలం, నెరబైలు పంచాయితీ, పులిబోనువారిపల్లెకు చెందిన కానాల భాస్కర రెడ్డికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె సంతానం. వీరిలో రామ్మోహన్‌రెడ్డి పెద్ద కుమారుడు కాగా చంద్రశేఖరరెడ్డి (50) రెండో కుమారుడు. రామ్మోహన్‌రెడ్డి కొన్నేళ్లుగా తిరుపతిలోని మంచినీళ్లగుంట సమీపంలో నివాసం ఉంటుండగా చంద్రశేఖర్ రెడ్డి స్వగ్రామంలోనే వుంటున్నాడు.చంద్రశేఖర రెడ్డి కుమారులు కాలూరు క్రాస్ సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతూ హాస్టల్లో ఉంటున్నారు. ఆదివారం కావడంతో పిల్లలను చూసేందుకు చంద్రశేఖర రెడ్డి స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంపై వచ్చాడు. కొంత సమయం గడిపిన తరువాత పిల్లలు తినుబండారాలు కావాలనడంతో వాటిని తీసుకొస్తానంటూ సాయంత్రం 3గంటలకు బయటకు వచ్చిన చంద్రశేఖరరెడ్డి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు.పాఠశాల సమీపంలోనే మాటువేసిన ఐదుగురు వ్యక్తులు చంద్రశేఖరరెడ్డిని అటకాయించారు. ఆయన ద్విచక్రవాహనంపై ఉండగానే దాడిచేయడం ప్రారంభించారు.దీంతో పరుగెత్తి పారిపోయేందుకు ప్రయత్నించగా ఆ ఐదుగురూ వెంటాడి కత్తులతో దారుణంగా నరికి వెళ్లిపోయారు.ఈ దాడిలో చంద్రశేఖరరెడ్డి ముఖం సగానికి పైగా రెండుగా తెగిపోయింది. ఓ చేతివేలు తెగి కిందపడిపోయింది. కుడిచేయి మణికట్టువద్ద ఎముకతో సహా విరిగిపోయింది. తీవ్రరక్తస్రావంతో అల్లాడిపోతున్న చంద్రశేఖరరెడ్డిని స్థానికులే 108అంబులెన్సులో రుయాస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ ఆయన మృతిచెందారు. తిరుపతి రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తన భర్తను ఆయన అన్న రామ్మోహన్‌రెడ్డే హత్య చేసి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తూ మృతుడి భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ సీఐ తమీమ్ అహ్మద్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు పాల్పడినట్టు అనుమానిస్తున్న రామ్మోహన్‌రెడ్డి పాత నేరస్తుడని సమాచారం. అలిపిరి పోలీస్ స్టేషన్‌లో ఆయనపై రౌడీషీట్ ఉండగా ఎర్రావారిపాలెం పోలీసు స్టేషన్‌లోకూడా ఆయనపై కేసులున్నట్టు చెబుతున్నారు. అన్నదమ్ములిద్దరికీ కొంతకాలంగా ఆస్తి తగాదాలు నడుస్తున్నందున అన్నే మరికొందరితో కలిసి తమ్ముడిని హతమార్చి ఉండొచ్చని భావిస్తున్న పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.రామ్మోహన్‌రెడ్డికి ఎర్రచందనం అక్రమ రవాణాలోకూడా భాగస్వామ్యం ఉందని, ఈ విషయాన్ని చంద్రశేఖరరెడ్డి బయట పెట్టినందుకే హత్యకు పాల్పడ్డారని కూడా ప్రచారం జరుగుతోంది.

## తిరుమలకు రాజకీయ స్టిక్కర్‌తో కారు


అధికారపార్టీ జెండా, నాయకుడి ఫొటోతో ఆలయం ముందు కారు

తిరుమల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాజకీయ నాయకుల ఫొటోలతో కూడిన ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు తిరుమలకు వచ్చిన ఘటన మరువకముందే మళ్లీ ఆ తరహా అతిక్రమణే చోటుచేసుకుంది. అధికార పార్టీ జెండాలోని రంగులతో కూడిన స్టిక్కర్‌తో ఉన్న కారు ఆదివారం తిరుమలకు వచ్చి విమర్శలకు దారితీసింది. ఆ జెండాపై రాజకీయనేత ఫొటో కూడా ఉండటం గమనార్హం. టీటీడీ బోర్డు సభ్యుడికి చెందిన కారుగా తెలిసింది. రాజకీయ పార్టీల జెండాలు, గుర్తులు, వ్యక్తులతో కూడిన స్టిక్కర్లతో తిరుమలకు రావడం నిషేధం. వీటిని అలిపిరిలోనే గుర్తించి తొలగించాల్సి ఉంటుంది. అయితే అధికార పార్టీకి చెందిన వ్యక్తుల వాహనాలు కావడంతో భద్రతా సిబ్బంది చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలోనే తరచూ అధికార పార్టీకి చెందిన జెండాలు, కండువాలు, స్టిక్కర్లతో వాహనాలు తిరుమలకు చేరుకుంటున్నాయి.

# రుయాలో క్రిటికల్ కేర్ బ్లాక్‌కు శంకుస్థాపన

● వర్చువల్‌గా చేసిన పీఎం నరేంద్ర మోదీ

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 25: ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం కింద దేశంలోని పలు క్రిటికల్ కేర్ బ్లాక్(సీసీబీ)లకు గుజరాత్ రాజకోట్ నుంచి వర్చువల్ విధానంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల అనుబంధ రుయాస్పత్రి ఆవరణలో రూ.23.75 కోట్లతో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్‌కు శంకుస్థాపన శిలా ఫలకం ఆవిష్కరించారు. ఎస్వీ వైద్య కళాశాల భవన విజయం ఆడిటోరియంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం వీక్షించే ఏర్పాటు చేశారు. పీఎం మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కేర్ ప్రాజెక్ట్ కింద దేశంలోని ఐదు అత్యంత ప్రతిష్టాత్మకమైన ఎయిమ్స్ కళాశాలలను జాతికి అంకితం చేసినట్లు చెప్పారు. 200కుపైగా హెల్త్ క్రిటికల్ కేర్ బ్లాక్‌లను ప్రారంభించడం, శంకుస్థాపనలు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యరంగానికి పెద్దపీట వేశాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మద్దిల గురుమూర్తి, జేసీ శుభం బన్సల్, డీఎంహెచ్‌వో శ్రీహరి, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, రుయా, ప్రసూతి ఆస్పత్రుల సూపరింటెండెంట్లు రవిప్రభు, పార్థసారథిరెడ్డి, టీబీ నియంత్రణాధికారి అరుణసులోచనదేవి, డీపీఎంవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.




వర్చువల్లో మాట్లాడుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ - శిలా ఫలకం ఆవిష్కరణలో అధికారులు

# తిరుపతిలో షార్ట్‌సర్క్యూట్‌తో చెప్పుల దుకాణం దగ్ధం

● రూ.కోటి మేర నష్టం


దగ్ధమవుతున్న దుకాణం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 25: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా రేగిన మంటలతో తిరుపతిలో రెండంతస్తుల చెప్పుల దుకాణం పూర్తిగా కాలిపోయింది. తిరుపతి జిల్లా సహాయ అగ్నిమాపకాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతికి చెందిన బద్రీనాథ్ వీవీ మహల్ రోడ్డులో నోవా కలెక్షన్స్ పేరిట ఓ చెప్పుల దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో చెప్పుల దుకాణం, మొదటి అంతస్తులో గోడౌన్, రెండో అంతస్తులో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. మూడో అంతస్తులో చిన్న గది ఉంది. ఆదివారం మధ్యాహ్నం సుమారు మూడు గంటల సమయంలో గ్రౌండ్‌ఫ్లోర్‌లోని చెప్పుల దుకాణం నుంచి పెద్దఎత్తున పొగలు వ్యాపించాయి. రెండో అంతస్తులోని యజమానులు కిందకు దిగి చూసేందుకు ప్రయత్నించగా దట్టంగా పొగలు వ్యాపించడంతో ప్రమాదాన్ని గ్రహించారు. తక్షణం కుటుంబ సభ్యులందరూ మిద్దెమీదకు చేరుకుని పక్క భవనాలపైనుంచి వెనుక ప్రాంతంలోని మరో భవనంపైకి చేరుకుని ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఈలోపు మంటలు పెద్దఎత్తున వ్యాపించాయి. గ్రౌండ్‌ఫ్లోర్‌లోని చెప్పుల దుకాణంతోపాటు మొదటి అంతస్తులోని గోడౌన్‌లోని సరుకు కాలిపోయింది. రెండో అంతస్తులోకి పొగలు వ్యాపించి గృహోపకరణాలన్నీ నల్లగా మాడిపోయాయి. స్థానికుల సమాచారం మేరకు తిరుపతి జిల్లా సహాయ అగ్నిమాపకాధికారి నేతృత్వంలో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. రెండు అగ్నిమాపక శకటాలతో సుమారు రెండు గంటలకుపైగా కష్టపడి మంటలను అదుపుచేశారు. మంటలు పక్క భవనాలకు వ్యాపించకుండా నిరోధించారు. డీఎస్పీ సురేంద్రరెడ్డి, ఈస్ట్ సీఐ తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బందికి సాయం అందించారు. ఈ ప్రమాదం వల్ల కోటి రూపాయల మేరకు నష్టం వాటిల్లినట్టు అగ్నిమాపకాధికారి వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వడమాలపేటలో జడ్పీటీసీ జోరు!

అధికారులు కూడా లేకుండానే మూడు ప్రభుత్వ భవనాలకు ప్రారంభోత్సవం


పత్తిపుత్తూరులో ఆర్బీకే భవనాన్ని ప్రారంభిస్తున్న మురళీధర రెడ్డి

వడమాలపేట, ఫిబ్రవరి 25 : నగరి నియోజకవర్గంలో వైసీపీ అసమ్మతి నేతల జోరు తగ్గడం లేదు. వడమాలపేట మండలంలో నిర్మించిన మూడు ప్రభుత్వ భవనాలను జడ్పీటీసీ సభ్యుడు మురళీధర రెడ్డి ఆదివారం ప్రారంభించేయడమే ఇందుకు నిదర్శనం.అప్పలాయగుంటలో సచివాలయం, పత్తిపుత్తూరులో రైతు భరోసా కేంద్రం, అయ్యన్నగారిపల్లిలో జగనన్న పాలవెల్లువ కేంద్ర భవనాలను జడ్పీటీసీ సభ్యుడు మురళీధర రెడ్డి ఒక్కరే ప్రారంభించేయడం చర్చనీయాంశంగా మారింది. ముందస్తు సమాచారం లేకుండా మంత్రి రోజా నియోజకవర్గ పరిధిలో అసమ్మతి నాయకుడు ఒకే పర్యాయం మూడు ప్రభుత్వ భవనాలను ప్రారంభించడం, అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం గమనార్హం. పైగా శిలా ఫలకాలు ఏర్పాటు చేసి మరీ అనుచరులతో కలిసి ప్రారంభించడం విశేషం. ఈ సందర్భంగా జడ్పీటీసీ మురళీధర రెడ్డి మాట్లాడుతూ ప్రజల చేత ఎన్నుకోబడిన జిల్లా పరిషత్ సభ్యుడి హోదాలో తానీ ప్రారంభోత్సవాలు చేసినట్లు తెలిపారు. ఎంపీడీవో సుజాతమ్మను ఈ విషయమై వివరణ కోరగా తాను గ్రూప్- 2 పరీక్ష విధుల్లో ఉన్నానని, ప్రభుత్వ కార్యాలయ భవనాల ప్రారంభ విషయం తన దృష్టికి రాలేదని తెలిపారు.

## రావణబ్రహ్మ వాహనంపై ఊరేగిన శివపార్వతులు



పలమనేరు, ఫిబ్రవరి25 : పలమనేరు కాశీవిశ్వేశ్వరాస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం వసంతోత్సవం నిర్వహించి, ధ్వజావరోహణ, త్రిశూల కార్యక్రమాలను ఆలయ అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం రాత్రి శివపార్వతులను రావణబ్రహ్మ వాహనంపై అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ గంటే వీరభద్ర, కమిటీ సభ్యులు, ఎండోమెంట్ సిబ్బంది భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలకు శ్రీబాలాజి కో ఆపరేటివ్ సూపర్‌బజార్ అధ్యక్షుడు ఆర్.వి.సుభాష్‌చంద్రబోస్, పలమనేరు మాజీ సర్పంచ్ ఆర్.వి. బాలాజి ఉభయదారులుగా వ్యవహరించారు.

## ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-2 పరీక్షలు

పలమనేరు, ఫిబ్రవరి25 : పలమనేరు, గంగవరం మండలాల్లో ఆదివారం 6 పరీక్షా కేంద్రాల్లో ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షా కేంద్రాల వద్ద పలమనేరు డీఎస్పీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీలు చేసి పరీక్షా కేంద్రాలలోకి అనుమతించారు. పలమనేరులోని సెయింట్ లూయిస్ జూనియర్ కళాశాలలో 220 మంది అభ్యర్థులకు గాను 190 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 330 అభ్యర్థులకు గాను 261 మంది, టీకేసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 500 మంది అభ్యర్థులకు గాను 409 మంది, ప్రభుత్వ డిగ్రీకళాశాలలో 500 మంది అభ్యర్థులకు గాను 428 మంది, గంగవరం మండలం శ్రీవాణి మహిళా జూనియర్ కళాశాలలో 550 మంది అభ్యర్థులకు గాను 440 మంది, శ్రీవాణి డిగ్రీకళాశాలలో 250 మంది అభ్యర్థులకు గాను 204 మంది,. మథర్ థెరీసా ఇంజినీరింగ్ కళాశాలలో 500 మంది అభ్యర్థులకు గాను 383 మంది పరీక్షలు రాశారు.

## బోయకొండలో అన్నదానం కోసం విరాళం



చౌడేపల్లె, ఫిబ్రవరి25:ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ భక్తులతో అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకాలు అర్చనలు చేసి, స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచియే కాకా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఛైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళిలు పర్యవేక్షించారు. అలాగే భక్తుల అన్నదానం కోసం బెంగళూరుకు చెందిన అమ్మవారి భక్తులు బెంగళూరు కు చెందిన ఎస్ఎల్ఎన్ రైస్ ట్రేడర్స్ అధినేత వనితా, ఉదయ్ కుమార్ దంపతులు రూ..25వేలు విరాళంగా ఇచ్చారు.

## ఫిలిమ్ చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా ఇన్‌చార్జిగా జెమిని ఎంపిక



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి25: ఏపీ ఫిలిమ్ చాంబర్ ఆఫ్ కామర్స్ చిత్తూరు జిల్లా ఇన్‌చార్జిగా పుంగనూరుకు చెందిన సినీనటుడు జెమినిని నియమించారు. ఆదివారం తిరుపతిలో జరిగిన సమావేశంలో ఏపీ రాష్ట్ర ఫిలిమ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, నిర్మాత ఏఎం రత్నం, కార్యదర్శి మోహన్‌గౌడ్‌లు నియమక పత్రం అందించి అభినందించినట్లు ఆయన తెలిపారు. పుంగనూరుకు చెందిన నటుడు జెమిని ఎంపిక కావడంతో పట్టణ ప్రముఖులు పలువురు అభినందనలు తెలిపారు.

## సేవలు చేయడానికి దాతల సహకారం అవసరం



మాట్లాడుతున్న మానవత సేవా సంస్థ ప్రతినిధులు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి25: పేదలకు సేవలు చేయడానికి దాతల సహకారం అవసరమని మానవతా సేవా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో జరిగిన సమావేశంలో సంస్థ ప్రతినిధులు ఏసీ నారాయణరెడ్డి, భక్తవత్సలరాజు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తులకు ఆసుపత్రికి తరలించడానికి అంబులెన్స్ అవసరమని, సంస్థ ఇప్పటికే మృతదేహాలను నిల్వ చేయడానికి ఫ్రీజర్‌బాక్స్‌లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు నరిసింహారెడ్డి, చెంగారెడ్డి, రామకృష్ణ,ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి సాయం



కుప్పం, ఫిబ్రవరి 25: కుప్పం మండలంలో మంకలదొడ్డి పంచాయతీ, ములకపల్లెలో వెంకటమ్మ అనే మహిళ అకాల మరణం చెందింది. టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మురళి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. మట్టి ఖర్చులకోసం రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో మంకలదొడ్డి పంచాయతీ తెలుగు యువత అధ్యక్షుడు విజయకుమార్, స్థానిక నాయకులు, చంద్రమౌళి, కనకరాజులు, మురళి, మునిరత్నం పాల్గొన్నారు.

## నాణ్యమైన టేబుల్ రకం మామిడికి ప్రపంచ దేశాల్లో మార్కెట్

● జిల్లా ఉద్యాన శాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 25: జిల్లాలో టేబుల్ వెరైటీ మామిడిపండ్లు నాణ్యతగా ఉండేలా రైతులు కృషిచేస్తే ప్రపంచ దేశాలతో పోటీపడి మార్కెట్ చేసుకోవచ్చని జిల్లా ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. గంగాధరనెల్లూరు మండలం 100 గొల్లపల్లె వద్ద గల జైన్‌ఫామ్‌ఫ్రెష్ ఫ్యాక్టరీలో మేనేజర్ షమీర్‌శర్మ అధ్యక్షతన ఆదివారం మామిడిపూత, పిందెదశలో సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన సమావేశం జరిగింది. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ మారిన వాతావరణ పరిస్థితులు దృష్ట్యా గత ఏడాది కంటే మామిడిపంటలో ఈసారి కాపు ఆలస్యం కావడంవల్ల దిగుబడి ఆశించినంతగా ఉండకపోవచ్చన్నారు. రైతులే స్వయంగా మామిడిని మార్కెట్‌కు తరలించి ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. షమీర్‌శర్మ మాట్లాడుతూ ప్రతి ఏడాది ఫ్యాక్టరీ తరఫున రైతుల శ్రేయస్సు కోసం అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈసమావేశంలో సీనియర్ అగ్రానమిస్ట్ డాక్టర్ ప్రసాద్, జిల్లా వైసీపీ రైతు విభాగం అధ్యక్షుడు వెంకటరెడ్డి, కోఆర్డినేటర్ చంద్రకుమార్, రైతులు, జైన్‌ఫ్యాక్టరీ సిబ్బంది పాల్గొన్నారు.

## వన్నియకుల క్షత్రియ, మొదలియార్ కులస్తుల ఆత్మీయ సమావేశం

చిత్తూరు, ఫిబ్రవరి 25: నగరంలోని డీఐ రోడ్డులో వన్నియకుల క్షత్రియ సమావేశం, సాయంత్రం ఎస్‌జీఎస్ కల్యాణ మండపంలో మొదలియార్ కులస్థుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా వైసీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి హాజరయ్యారు. వన్నియకుల క్షత్రియులు నగరంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్ రెడ్డి, కార్పొరేటర్లు వెంకట్, గణేష్, శశి, నవీన్‌కుమార్, దళవాయిపల్లె శివకుమార్, సహదేవన్, తదితరులు పాల్గొన్నారు.

## 28 నుంచి బోయకొండలో లక్ష కుంకుమార్చన

చౌడేపల్లె, ఫిబ్రవరి25: బోయకొండ గంగమ్మ ఆలయంలో ఈనెల 28న లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో చంద్రమౌళి పేర్కొన్నారు. ఈనెల28 నుంచి మార్చి 1 వరకు లక్ష కుంకుమార్చన ఉంటుందన్నారు. అధిక సంఖ్యలో భక్తులు కుంకుమార్చన సేవలో పాల్గొనాలని కోరారు.

# వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ వలసలు





టీడీపీలో చేరిన చౌడేపల్లె మండల యువకులు, రొంపిచెర్ల మండలం పడమటి హరిజనవాడలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

చౌడేపల్లె, ఫిబ్రవరి 25 : చౌడేపల్లె మండలం నుంచి 150 మంది వైసీపీ సానుభూతి పరులు పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఆదివారం మండల పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో దిగువపల్లె, అమినిగుంట, ఎల్లకుంట్ల, లద్దిగం, గడ్డంవారిపల్లె, పెద్దకొండామారి, పంచాయతీల నుంచి 150 మందికి ఆయన కండువా కప్పి టీడీపీలో చేర్చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మీపతిరాజు, బోయకొండ సుబ్రహ్మణ్యం, జంపాల శ్రీనివాసులునాయుడు, కల్యాణ్, మునెంక టప్ప, శివశంకర్‌రాజు, ప్రభాకర, హరిప్రసాద్, వెంకట్రాయప్ప, మహ్మద్‌గని, కార్తిక్, గిరిరాజు, మాజీ ఎంపీటీసీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

**రొంపిచెర్ల :** రొంపిచెర్ల మండలం పెద్దగొట్టిగల్లు పంచాయతీ పడమటి హరిజనవాడకు చెందిన వైసీపీ కార్యకర్తలు పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి చల్లాబాబు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.పెద్దగొట్టిగల్లు మాజీ సర్పంచ్ ఓబులేశ్వర్‌రెడ్డి సమక్షంలో మాజీ సర్పంచ్ రమణ, రెడ్డిబాషా, పేటమధు, రాగవశెట్టి శేఖర్, వి.జయన్న, రాజమ్మ టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఉయ్యాల రమణ, ఐటీడీపీ అధ్యక్షుడు గూడూరు హరిబాబు, మాజీ సర్పంచ్ రవికుమార్‌నాయుడు, నాయకులు షేక్ కరీముల్లా, జి.షఫీ, అబూబకర్, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

### తాతల కాలం నాటి పొలం లాక్కొన్నారు

చౌడేపల్లె 9వ వార్డు సభ్యురాలు



చౌడేపల్లె 9వ వార్డు సభ్యురాలు వరలక్ష్మి, ఆమె భర్త వెంకటరాయప్ప

**చౌడేపల్లె :** తాతల కాలం నాటి పొలం సైతం వైసీపీ నాయకుల ప్రోద్బలంతో అధికారులు లాక్కొన్నారని చౌడేపల్లె పంచాయతీ 9వ వార్డు సభ్యురాలు వరలక్ష్మి భర్త వెంకటరాయప్ప ఆరోపించారు. ఆదివారం ఆయన రొంపిచెర్లలో చల్లా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ తాతల కాలం నుంచి కొమటిచెరువు సమీపంలో కొంత పొలం సాగు చేసుకుంటూ ఉండేవాళ్లమన్నారు. ఆ భూమిలో మామిడి, కొబ్బరి చెట్లు సైతం వైసీపీ నాయకుల ఆదేశాలతో అధికారులు ధ్వంసం చేసి దౌర్జన్యంగా లాక్కొన్నారన్నారు. ఆదే అధికార పార్టీకి చెందిన వ్యక్తులు చెరువులను, దేవుడి మాన్యం భూములను కబ్జాలు చేసుకుంటున్నా అధికారులు సైతం నోరు మెదపలేదన్నారు.

# అందుబాటులో ఉంటా.. ఆదరించండి : అమర్

గంగవరం, ఫిబ్రవరి 25 : ప్రజాసమస్యలపై ఎప్పుడైనా సరే నన్ను నేరుగా కలవచ్చని, మీ సమస్యలు పరిష్కరించి మీకు అండగా ఉంటానంటూ మాజీ మంత్రి అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. పలమనేరు టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా అధిష్టానం ప్రకటించిన తరువాత మొదటిసారిగా ఆయన ఆదివారం గంగవరం పంచాయతీ పరిధిలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. అమరనాథరెడ్డికి గంగవరం మండల నాయకులు చిల్లర నాణేలు, మొక్కజొన్నలు, పట్టుగూళ్ల గజమాలలో సత్కరించి గంగవరంలోకి ఆహ్వానించారు. గడప గడపకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, వారి సమస్యలను అడిగి తెలుసుకుని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి తప్ప, ఈ నాలుగున్నరేళ్లలో అభివృద్ధి జాడ ఎక్కడా కనిపించడంలేదన్నారు. ఈ ప్రభుత్వంలో గ్రామాల్లో కనీస మౌళిక సదుపాయాలు కల్పించడంలో కూడా చొరవ తీసుకోకపోవడం దారుణమన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘ నాయకులు గంగవరంలో అమరనాథరెడ్డిని కలిసి తమకు ఎప్పుడు జీతాలు వస్తాయో తెలియని ఆయోమయస్థితిలో ఉన్నామని, మీరైనా న్యాయం చేయండంటూ వినతిపత్రం సమర్పించారు. సాయిమహాలక్ష్మి లేఔట్ లో పర్యటిస్తుండగా ఈ ప్రాంతంలో రోడ్లు సరిగాలేవని, పంచాయతీ అయినప్పటికీ మున్సిపాలిటీ కన్నా అధికంగా పన్నులు వేస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్, నాయకులు ప్రతాప్‌రెడ్డి, ప్రసాద్‌నాయుడు, హరిబాబు, మురళి, యుగంధర్, గిరిదర్‌గోపాల్, చిట్టిబాబు, ఆనంద్‌నాయుడు, రామ్మోహన్‌నాయుడు, ఆలపల్లి రాజన్న ,ఎస్సీసెల్ రవి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



చిల్లర నాణేలతో భారీ హారం వేస్తున్న అభిమానులు

# కేఈసీలో ఘనంగా నాగాస్త్ర వేడుకలు





నాగాస్త్ర వేడుకలను ప్రారంభిస్తున్న కిరణ్ అబ్బవరం, బీసీ.నాగరాజ్ తదితరులు, నృత్యం చేస్తున్న కిరణ్ అబ్బవరం

కుప్పం, ఫిబ్రవరి 25: కుప్పం ఇంజినీరింగ్ కళాశాల 23వ వార్షికోత్సవం (నాగాస్త్ర - 2024) వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. యంగ్ హీరో కిరణ్ అబ్బవరం ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి ఆడిపాడి ఆహుతులను అలరించారు. తన విద్యార్థి జీవితంలోని అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. బీసీఎన్ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులు అదృష్టవంతులని పేర్కొన్నారు. బీసీఎన్ విద్యా సంస్థల అధినేత బీసీ.నాగరాజ్ మాట్లాడుతూ కుప్పం ఇంజినీరింగ్ కాలేజ్ బోధన, పరిశోధన రంగాలలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంతరించుకుని 23వ వార్షికోత్సవాన్ని జరుపుకోవడం ఆనందంగా ఉన్నదన్నారు. వైస్ ఛైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్ మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించడంలో కేఈసీ ముందడుగు వేస్తున్నదని తెలిపారు. ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌బాబు వార్షిక నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కుప్పం డిగ్రీ కళాశాల ఛైర్‌పర్సన్ శాంతా నాగరాజ్, అధ్యాపకులు, కేఈసీ సీఈవో ఎస్.సాగర్‌రాజ్, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### ఊర్ల పేర్లు తేడాగా...







కల్లూరు,ఫిబ్రవరి25: కల్లూరు-రొంపిచెర్ల మార్గంలోని ఆర్అండ్‌బీ రహదారి పనులు ఇటీవల పూర్తయ్యాయి. రహదారికి అను కుని ఉన్న గ్రామాలు, రహదారి నుంచి లోపలకు వెళ్లే గ్రామాల పేర్లను తెలియ జేస్తూ బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే కొన్నిచోట్ల ఏర్పాటు చేసిన బోర్డులను చూసిన ప్రజలకు నవ్వులు తెప్పిస్తున్నాయి. పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ మర్రిగుంటవారిపల్లి పేరును 'మారికూటవారిపల్లి' అని, పాళెం పేరును 'పాలం' అని తప్పుగా రాసిన బోర్డులను ఏర్పాటుచేశారు. అధికారులు స్పందించి ఊరిపేర్లను ఎరిదిద్దాల్సిన అవసరం ఉంది.

# వైభవంగా మసెమ్మ జాతర







మసెమ్మకు పూజ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, మసెమ్మను పూజిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి, బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్

పుంగనూరు, ఫిబ్రవరి 25: పుంగనూరు మండలం ఆరడిగుంట పంచాయతీ పెద్దకొండకురప్పల్లెలో వెలసిన మసెమ్మ జాతర ఆదివారం వైభ వంగా జరిగింది. రెండో రోజు అమ్మవారిని పూలతో అలంకరించి శాస్త్రో క్తంగా పూజలు నిర్వహించి గ్రామంలో ఊరేగించి నిమజ్జనం చేశారు. అమ్మవారికి మహిళలు చలిపిండి దీపాలు, పెరుగన్నంతో పాటు జంతుబలులు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా కురప్పల్లె ఆంధ్ర, కర్ణాటక భక్తులతో కిక్కిరిసింది. ఆలయానికి రంగురంగుల పూలు, విద్యుత్ దీపాలతో అలంక రణలు అందరినీ ఆకట్టుకున్నాయి. జాతర సందర్భంగా వైసీపీ, బీసీవైపీ, టీడీపీ స్వాగత ఫ్లెక్సీలు జోరుగా వెలిసి అనుచరులు వారి అభిమానాన్ని చాటుకున్నారు.

**అమ్మవారిని దర్శించుకున్న మంత్రి పెద్దిరెడ్డి**

కురప్పల్లెలో వెలసిన మాసెమ్మ అమ్మవారిని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దర్శించుకుని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆయన వెంట ఎంపీ ఎన్.రెడ్డెప్ప, వైసీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, నాగభూషణం, అలీంబాషా, రాజేశ్, జయచంద్రారెడ్డి ఉన్నారు.

**మాసెమ్మ సేవలో బీసీవై పార్టీ అధ్యక్షుడు**

బీసీవై పార్టీ అధ్యక్షుడు బి.రామచంద్రయాదవ్ తెఅమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఆర్.హరినాథరెడ్డి, బీసీవైపీ నాయకులు సాంబమూర్తి, ఆనంద్, సురేంద్ర, వెంకటేశ్, సుబ్రహ్మణ్యంరెడ్డి ఉన్నారు.

**చల్లా బాబు ప్రత్యేక పూజలు**

పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. టీడీపీ నాయకులు మాధవరెడ్డి, రామయ్య, విరూపాక్షి, సద్దాం, సీవీరెడ్డి తదితరులు ఉన్నారు.

## మాజీ మంత్రిని కలిసిన గురజాల



పలమనేరు/గంగవరం, ఫిబ్రవరి25 : చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ ఆదివారం పలమనేరులో మాజీ మంత్రి అమరనాథరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## పలమనేరు కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం దరఖాస్తు

పలమనేరు, ఫిబ్రవరి25 : పలమనేరు నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసేందుకు తనకు అవకాశం ఇవ్వాలని కోరుతూ పట్టణానికి చెందిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫైరోజ్ దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఆమేరకు విజయవాడకు వెళ్లి పార్టీ కార్యాలయంలో తన దరఖాస్తును అందజేసినట్లు తెలిపారు.

## సీసీ రోడ్ల పనులు వేగవంతం చేయాలి

సోమల, ఫిబ్రవరి 25: సోమల ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని వైస్ ఎంపీపీ ప్రభాకర్, సింగిల్ విండో అధ్యక్షుడు డాక్టర్ వేంకటేశ్వరరావు కోరారు. ఆదివారం డీఈ ప్రసాద్ పర్యవేక్షణలో కాంక్రీట్ పనులు ముమ్మరం చేశారు. ఎంపీ మిధున్ రెడ్డి ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణ పనులకు రూ. 60లక్షలు మంజూరు చేశారు. ఈక్రమంలోనే మండల ప్రజలకు సౌకర్యంగా ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. అదనపు నిధులు మంజూరుతో బస్సుల రాకపోకలకు సౌకర్యంగా సీసీ రోడ్ల నిర్మాణం పనులు చురుగ్గా చేపట్టారు. కార్యక్రమంలో జేఈ ఆనంద్, మాజీ ఎంపీటీసీ రమణయ్య, జి. సాంబయ్య, వీవీ. రమణ పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ సభను విజయవంతం చేద్దాం

సోమల, ఫిబ్రవరి 25: తిరుపతిలో ఈనెల 27న జరిగే ఎమ్మార్పీఎస్ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర సహాయ కార్యదర్శి మురళీ కోరారు. ఆదివారం సోమల, కందూరు, నెల్లిమంద, తెట్టుపల్లె గ్రామాల్లో ఆ సంఘ నాయకులు ప్రచారం నిర్వహించి తిరుపతి సభకు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మందా రామనాధం, మండల అధ్యక్షుడు ప్రకాశ్, లక్ష్మీపతి, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాలేటమ్మకు విశేష పూజలు

సోమల, ఫిబ్రవరి 25: మండలంలోని నెల్లిమంద పాలేటమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి విశేష అలంకరణ చేసి అభిషేకపూజలు జరిపారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బోణాలు, దీలు చెల్లించుకున్నారు. పలువురు తమ వాహనాలకు పూజలు జరిపించారు. టమోటా సీజన్‌కు మొక్కలు నాటే రైతులు అమ్మవారి తీర్థాలు స్వీకరించారు. తీర్థాలు పొలాల్లో చల్లడం ఆనవాయితి. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కుసుమ, ఏఎంసీ ఛైర్‌పర్సన్ అరుణ, ఏఎంసీ మాజీ ఛైర్మన్లు మోహన్, నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అమినిగుంటలో దళిత రచ్చబండ



చౌడేపల్లె, ఫిబ్రవరి25: దళితుల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు మల్లిక పేర్కొన్నారు. ఆదివారం ఆమె అమినిగుంటలో దళిత రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..దళితుల కోసం ప్రధాని నరేంద్రమోదీ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు బాబు, మురళి పాల్గొన్నారు.

## పుంగనూరులో మార్పు మొదలైంది

గువ్వల రమేశ్‌రెడ్డి

పుంగనూరు, ఫిబ్రవరి 25: పుంగనూరు నియోజవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి ఆరాచకాలతో ప్రజలు విసిగిపోయి తెలుగుదేశంపార్టీలో చేరడానికి మార్పు మొదలైందని చౌడేపల్లె మండల టీడీపీ అధ్యక్షుడు గువ్వల రమేశ్‌రెడ్డి చెప్పారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ చౌడేపల్లె మండలం నుంచి భారీగా 250 కుటుంబాలు వైసీపీ సానుభూతిపరులు, క్రియాశీలక కార్యకర్తలు రొంపిచెర్లలో టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ద్వారా కండువాలు కప్పుకుని టీడీపీలో చేరడం శుభపరిణామమని చెప్పారు. వైసీపీపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ఇంకా నియోజకవర్గంలో టీడీపీలో భారీగా చేరికలు ఉంటాయని, పోలీసు, కొందరు అధికారుల వల్ల మంత్రి పెద్దిరెడ్డి అక్రమకేసులు, రౌడీషీట్లు పెట్టడం, తదితర ఇబ్బందులతో చాలా మంది ఎన్నికల కోడ్ తర్వాత బయటకు వస్తారని, పుంగనూరులో జరిగే ఎన్నికల్లో వైసీపీ ఓటమి, టీడీపీ జెండా ఎగరడం తథ్యమన్నారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

పెనుమూరు, ఫిబ్రవరి 25: ఎక్కడెక్కడో పుట్టి పెరిగి చదువుల ఒడిలో ఒకటైన పూర్వ విద్యార్థులు చాలా కాలం తరువాత కలిసి ఆత్మీయంగా పలకరించుకుని అలనాటి తీపి జ్ఞాపకాలను పంచుకున్నారు. 1967-68 ఏడాది పెనుమూరు మండలంలోని ఉగ్రాణంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం చిత్తూరు ఎన్జీవో హోంలో ఆత్మీయ సమావేశంలో కలిశారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యం నాయుడు, రాజేంద్ర నాయుడు, వేణుగోపాల్ నాయుడు, నారాయణ, దొరస్వామి నాయుడు, రాణి, అమరావతి, రాజేశ్వరి, చిన్నస్వామి పాల్గొన్నారు.

## నేడు చిత్తూరు నగరపాలక కార్యాలయంలో స్పందన కార్యక్రమం

చిత్తూరు, ఫిబ్రవరి 25: చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ అరుణ తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు. సమస్యలుంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్ని సచివాలయాల్లో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తారని తెలిపారు.

## షబేబరాత్ పండుగ

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 25: ముస్లింల అత్యంత ప్రధానమైన షబేబరాత్ పండుగను ఆదివారం భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. నగరంలోని అన్నీ మసీదుల్లో ముస్లింలు తమ పితృదేవతలను ప్రార్థిస్తూ నమాజులు చేశారు. తమ కుటుంబ సభ్యులతో కలిసి రాత్రంతా జాగరణ చేశారు.

# చిత్తూరు
## జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

### నా గెలుపునకు సహకరించండి

● జిల్లా నాయకుల్ని కలిసి మద్దతు కోరిన గురజాల జగన్మోహన్


పలమనేరులో మాజీ మంత్రి అమరనాథరెడ్డిని కలిసిన గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 25: 'జిల్లాలోని సీనియర్ల ఆదేశానుసారం చిత్తూరులో పార్టీ గెలుపునకు కృషి చేస్తాను.. సహకరించండి' అని చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ కోరారు. తనకు టికెట్ వచ్చిన సందర్భంగా ఆయన శని, ఆదివారాలు జిల్లా టీడీపీ సీనియర్ నాయకుల్ని కలిసి మద్దతు కోరారు. ఆదివారం పలమనేరుకు వెళ్లి అక్కడ మాజీ మంత్రి అమరనాథరెడ్డిని కలిశారు. అలాగే చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు పులివర్తి నానిని శనివారం రాత్రి చిత్తూరులోని ఆయన ఇంట్లో కలిశారు. ఆదివారం బంగారుపాళ్యం మండలంలో జరిగిన నాని మామ వర్ధంతి కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. చిన్నపాటి ఆరోగ్య సమస్యతో తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్సీ దొరబాబును శనివారమే కలిసి పరామర్శించారు. అలాగే తనతో పాటు ఆశావహులైన మిగిలిన ఐదుగురితోనూ ఫోనులో మాట్లాడి సహకారం కోరారు. ఆశావహుల్లో ఒకరిద్దరు ప్రస్తుతానికి ముభావంగా ఉన్నప్పటికీ పార్టీ అధిష్ఠానం ఆదేశానుసారం కలిసి పని చేయనున్నారు.

### గురజాలకు పలువురి అభినందనలు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 25: చిత్తూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్‌ను ఆదివారం ఆయన నివాసంలో నియోజవర్గంలోని చిత్తూరు నగరం, రూరల్, గుడిపాల మండలాల్లోని ప్రముఖులు, వ్యాపారవేత్తలు కలసి అభినందనలు తెలిపారు. ఆయనను గజమాలలు, పుష్పగుచ్చాలు ఇచ్చి, కండువాలు కప్పి సన్మానించారు.

### టీడీపీ, జనసేన విజయం తథ్యం: భానుప్రకాష్


నగరిలో గాలి భానుప్రకాష్‌ను సన్మానిస్తున్న తెలుగుతమ్ముళ్లు

నగరి, ఫిబ్రవరి 25: రాష్ట్రంలో, నగరిలో టీడీపీ, జనసేన విజయాన్ని ఎవరూ ఆపలేరని నగరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ ధీమా వ్యక్తం చేశారు. నగరి టీడీపీ కార్యాలయంలో ఆదివారం గాలి భానుప్రకాష్‌ను పలువురు తెలుగు తమ్ముళ్లు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని, వైసీపీ తుడిచిపెట్టుకు పోతుందని తెలిపారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అన్ని రంగాలలో ముందుకు దూసుకెళుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేష్‌బాబు, మీరా, గుణశేఖర్, గోపాల్, మదివాసన్, అల్లిముత్తు, చిత్తూరు బాబు నాయుడు, జనసేన నాయకులు, రుక్కుం బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

### భానుప్రకాష్‌ను సన్మానించిన టీడీపీ కార్యకర్తలు

విజయపురం, ఫిబ్రవరి 25: నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌ను ఆదివారం తిరుపతిలోని ఆయన స్వగృహంలో, నగరి టీడీపీ కార్యాలయంలో పలువురు కలిపి పూలమాలలు, శాలువాతో సన్మానించారు. నగరి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడంతో హర్షం వ్యక్తం చేశారు. మండలం నుంచి పలు గ్రామాల కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు రమేశ్‌రాజు, నాయకులు శరత్, గోవిందయ్య, హరి, బాబు యాదవ్, దశరథరాజు, కపిల్, సుధాకర్‌యాదవ్, సెల్వం, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

### యువతకు క్రికెట్ కిట్ల పంపిణీ



విజయపురం, ఫిబ్రవరి 25: మండలంలోని మల్లారెడ్డి కండ్రిగ, నారపరాజు కండ్రిగ పంచాయతీల్లో జనసేన, టీడీపీ నాయకులు ఆదివారం యువతకు క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతకు క్రీడలపై ఆసక్తిని పెంపొందించడానికి తమవంతు సాయం చేస్తున్నట్టు తెలిపారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీ, జనసేన సమన్వయంతో గాలి భానుప్రకాష్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. అనంతరం సూపర్‌సిక్స్ పత్రాలను గోడలకు అంటించి బాబు ష్యూరిటీ... భవిషత్తుకు గ్యారెంటీ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సమరసింహారెడ్డి, మునిరత్నం, సుబ్రహ్మణ్యం, పద్మజ, మునికృష్ణయ్య, టీడీపీ నాయకులు మునివరాల్, మునిశేఖర్, మునస్వామి, నాధముని తదితరులు పాల్గొన్నారు.

### చంద్రబాబుకు ఓటు... భవితకు బంగారు బాట


సమావేశంలో పాల్గొన్న యువత, మహిళలు

నగరి, ఫిబ్రవరి 25: రానున్న ఎన్నికలలో చంద్రబాబుకు ఓటేసి మీ భవితకు బంగారు బాట వేసుకోవాలని రామానుజం చలపతి పేర్కొన్నారు. నగరి పట్టణ పరిధిలోని సామాలమ్మ గుడి వద్ద మాజీ కౌన్సిలర్ లత, చలపతిల ఆధ్వర్యంలో ఒకటి, మూడవ వార్డు యువతతో ఆదివారం సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ చంద్రబాబుకు ఓటేసి ముఖ్యమంత్రిని చేస్తే మీ అందరికీ జాబులు రావడం గ్యారెంటీ అని, సైకిల్ గుర్తుకు ఓటేసి తెలుగుదేశం పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఒకటో వార్డు తెలుగు మహిళలు అలిమేలు, రాధ, మూడవ వార్డు తెలుగు మహిళలు ఆదెమ్మ, బూసమ్మ, ఆదిఆంధ్రవాడ యువకులు పాల్గొన్నారు.

### నాణ్యమైన టేబుల్ రకం మామిడికి ప్రపంచ దేశాల్లో మార్కెట్


మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవనశాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 25: జిల్లాలో టేబుల్ వెరైటీ మామిడిపండ్లు నాణ్యతగా ఉండేలా రైతులు కృషిచేస్తే ప్రపంచ దేశాలతో పోటీపడి మార్కెట్ చేసుకోవచ్చని జిల్లా ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. గంగాధరనెల్లూరు మండలం 100 గొల్లపల్లె వద్ద గల జైన్‌ఫామ్‌ఫ్రెష్ ఫ్యాక్టరీలో మేనేజర్ షమీర్‌శర్మ అధ్యక్షతన ఆదివారం మామిడిపూత, పిందెదశలో సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన సమావేశం జరిగింది. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ మారిన వాతావరణ పరిస్థితులు దృష్ట్యా గత ఏడాది కంటే మామిడిపంటలో ఈసారి కాపు ఆలస్యం కావడంవల్ల దిగుబడి ఆశించినంతగా ఉండకపోవచ్చున్నారు. రైతులే స్వయంగా మామిడిని మార్కెట్‌కు తరలించి ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. షమీర్‌శర్మ మాట్లాడుతూ ప్రతి ఏడాది ఫ్యాక్టరీ తరఫున రైతుల శ్రేయస్సు కోసం అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈసమావేశంలో సీనియర్ అగ్రానమిస్ట్ డాక్టర్ ప్రసాద్, జిల్లా వైసీపీ రైతు విభాగం అధ్యక్షుడు వెంకటరెడ్డి, కోఆర్డినేటర్ చంద్రకుమార్, రైతులు, జైన్‌ఫ్యాక్టరీ సిబ్బంది పాల్గొన్నారు.

### టీడీపీ, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితా చూసి జగన్‌కు వణుకు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 25: టీడీపీ - జనసేన ఎమ్మెల్యే అభ్యర్థుల తొలి జాబితా చూసి తాడేపల్లిలోని సీఎం జగన్‌కు వణుకు పుట్టిందని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు పులివర్తి నాని, ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ, జనసేన పొత్తు చారిత్రాత్మక అవసరమని తెలిపారు. ఇందులో భాగంగానే తొలి విడతగా ఇరుపార్టీలు మొత్తం 99 మంది అభ్యర్థులను బరిలోకి దింపిందని పేర్కొన్నారు. ప్రజాప్రయోజనాల కోసం పనిచేసే నాయకులను కూటమి ఎంపిక చేసిందని తెలిపారు. వైసీపీకి ఈ ఎన్నికల్లో పోటీచేయడానికి కనీసం అభ్యర్థులు దొరకడంలేదని ఎద్దేవా చేశారు. సీఎం జగన్ అణగదొక్కిన ఎస్సీలకు టీడీపీ, జనసేన జాబితాలో సముచిత స్థానం కల్పించిందని తెలిపారు. మొత్తం 19 మంది ఎస్సీలకు సీట్లు ఇచ్చామని గర్వంగా చెబుతున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి అధికారాన్ని చేపట్టబోతోందని ఆప్రకటనలో వారు తెలిపారు.

### డాక్టర్ థామస్‌ను గెలిపించాలి

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 25: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గంగాధర నెల్లూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ రావెళ్ల లోకేష్ అన్నారు. ఆదివారం నెలవాయి గ్రామంలో డాక్టర్ థామస్‌ను బెంగళూరు విభాగం సభ్యులు కలిసి శాలువతో సన్మానించారు. రాబోయే ఎన్నికల్లో డాక్టర్ థామస్ విజయం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గురు, ఢిల్లీ, అమర్, హేమంత్, దేవా, నవీన్, వాసు, కపిల్, రాఘవ, దినేష్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

**వెదురుకుప్పం:** గంగాధరనెల్లూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా డాక్టర్ థామస్‌ను నియమించడంతో ఆదివారం వెదురుకుప్పం మండల టీడీపీ శ్రేణులు ఆయన్ను గజమాలతో సన్మానించి, సత్కరించారు. ఎమ్మెల్యేగా గెలిపించి చంద్రబాబుకు కానుకగా ఇస్తామని టీడీపీ నాయకులు వెల్లడించారు.

**కార్వేటినగరం:** జీడీ నెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యేగా డాక్టర్ థామస్‌ను అఖండ మెజారిటీతో గెలిపించుకుంటామని గోపిశెట్టి పల్లి గ్రామానికి చెందిన రాజా తెలిపారు. ఆదివారం థామస్‌ను కలిసి పూలమాలతో ఘనంగా సన్మానించారు. గోపిశెట్టి పల్లి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### భక్తి ప్రపత్తులతో షబేబరాత్ పండుగ

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 25: ముస్లింల అత్యంత ప్రధానమైన షబేబరాత్ పండుగను ఆదివారం భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. నగరంలోని అన్నీ మసీదుల్లో ముస్లింలు తమ పితృదేవతలను ప్రార్థిస్తూ నమాజులు చేశారు. తమ కుటుంబ సభ్యులతో కలిసి రాత్రంతా జాగరణ చేశారు.

### గొడుగుల పంపిణీ



గుడిపాల, ఫిబ్రవరి 25: గురజాల జగన్మోహన్ నాయుడు చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వసంతాపురం హరిజనవాడ, అరుంధతివాడలో ఇంటింటికీ తెలుగుదేశం గొడుగులను టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు రాజ్‌కుమార్ రెడ్డి, రంగనాథం, గణేష్, దాము, నరేంద్ర, ఉదయ్, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

### సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

నగరి, ఫిబ్రవరి 25: నగరి పట్టణ పరిధిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం మంత్రి రోజా 12 మంది బాధితులకు రూ.16లక్షల విలువ చేసే సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటానని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

### నగరంలో బీజేపీ ప్రజాపోరు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 25: బీజేపీ తలపెట్టిన ప్రజాపోరులో భాగంగా ఆ పార్టీ శ్రేణులు ఆదివారం స్థానిక గంగినేని చెరువు వద్ద కార్యక్రమం నిర్వహించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు గురుగణేష్, మోహన్, శ్రీనివాసన్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత నేత్ర వైద్యశిబిరానికి విశేష స్పందన


కంటి రోగులను పరీక్ష చేస్తున్న డాక్టర్లు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 25: స్థానిక రాములగుడి వీధి జైన్ ప్రార్థనా మందిరంలో ఆదివారం చిత్తూరు జైన్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి నగరవాసుల నుంచి విశేష స్పందన లభించింది. వైద్యశిబిరంలో 200మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలను పంపిణీ చేశారు. 91 మంది కంటి రోగులకు ఆపరేషన్లు అవసరం కాగా వారందరికి చిత్తూరు జైన్ సంఘం అన్ని ఖర్చులు భరించి వైద్యం చేయించనున్నట్లు సంఘం అధ్యక్షుడు సుభాష్‌జైన్ తెలిపారు. ప్రేమ్ చంద్, విశాల్, సాగర్, ప్రవీణ్, లలిత్, జతిం, జ్యోతి, ఎవంత్, కమలేష్, అమిత్‌జైన్లు తిరుపతి అరవింద నేత్ర వైద్యశాల డాక్టర్లు పాల్గొన్నారు.

### భక్తి ప్రపత్తులతో సామూహిక విష్ణుసహస్ర నామ పారాయణం

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 25: గిరింపేట బ్రాహ్మణవీధి సత్యసాయి సంస్థాన్‌లో ఆదివారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో 108మంది భక్తులు 108సార్లు సామూహిక విష్ణుసహస్ర పారాయణం నిర్వహించారు. పురాణ పండిట్ రాము భక్తులచే పారాయణం చేయించారు. ఆధ్యాత్మిక ఉపన్యాసకులు రాఘవన్ సత్యసాయిబాబా బోధనల గురించి వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు. సత్యసాయి సేవాసమితి నగర కన్వీనర్ శేషనారాయణ. ఎస్. మధుసూదనం, బి. పాండురంగం, శ్రీకంఠయ్య, గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

కుప్పం, ఫిబ్రవరి 25: మండలంలో మంకలదొడ్డి పంచాయతీ, ములకపల్లెలో వెంకటమ్మ అనే మహిళ అకాల మరణం చెందింది. టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మురళి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. మట్టి ఖర్చులకోసం రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. విజయ కుమార్, చంద్రమౌళి, కనకరాజులు పాల్గొన్నారు.

### వైసీపీ సర్పంచ్ సహా వంద మంది తెలుగుదేశం పార్టీలో చేరిక


అబ్బులురెడ్డికి పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న డాక్టర్ థామస్

వెదురుకుప్పం, ఫిబ్రవరి 25: వైసీపీకి చెందిన కురివికుప్పం గ్రామ సర్పంచ్ బుదురు అబ్బులురెడ్డి సహా ఉప సర్పంచ్ వేమయ్య, వంద మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. వీరిని గంగాధరనెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వీఎం థామస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆదివారం వెదురుకుప్పం మండలం కురివికుప్పంలో మండల టీడీపీ అధ్యక్షుడు కామసాని లోకనాథరెడ్డి అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా థామస్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం నారాయణస్వామి బండారం త్వరలో బట్ట బయలు చేస్తామన్నారు. తనపై బురద చల్లేప్రయత్నం చేస్తే సహించబోనని హెచ్చరించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో నారాయణస్వామిని అసహించుకుంటున్నారని, ఆయన స్వచ్ఛందంగా రాజకీయ సన్యాసం తీసుకోవాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకే ఓటేసి తనను గెలిపించాలని కోరారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తానని థామస్ చెప్పారు. ఈ సందర్భంగా థామస్ గెలుపునకు కృషి చేస్తామని నాయకులు, కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కురివికుప్పం పంచాయతీలోని గ్రామాల్లో ఇంటింటికీ డాక్టర్ థామస్ కార్యక్రమాన్ని టీడీపీ కార్యకర్తలు, నాయకులతో కలసి నిర్వహించారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను వివరించి, కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో గ్రామకమిటీ అధ్యక్షుడు నాదముని రెడ్డి, ఎన్ఆర్ఐ కో-ఆర్డినేటరు గురుసాల కిషన్‌చంద్, నాయకులు బట్టే చాణిక్యప్రతాప్, గుండయ్య, శంకర్, పి.మోహన్‌మురళి, కావలి చక్రి, సర్పంచ్ అబ్బులురెడ్డి, ఉప సర్పంచ్ వేమయ్య, వెంకటరమణారెడ్డి, రాజశేఖర్‌వర్మ, నరసింహులు యాదవ్, శివరాంయాదవ్, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

### అరకొర పనులతో ప్రమాదాలు

● ప్రమాదకరంగా మారిన గాజులపల్లి రోడ్డు


రోడ్డు పక్కన కోసుకుపోయిన దృశ్యం, మరమ్మతుకు గురైన బ్రిడ్జి

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 25: చిత్తూరు మండలంలోని గాజులపల్లి, మాపాక్షికి వెళ్లే రోడ్డు మార్గంలో బీఎస్ఎన్ఎల్ ఇంటర్‌నెట్ వైర్లు అమర్చేందుకు కాలువలు తవ్వారు. వాటిని సక్రమంగా పూడ్చకపోవడంతో రోడ్డు పక్కన కోసుకుపోయి పెద్ద రంధ్రం ఏర్పడింది. ఇది గమనించని వాహనదారులు రంధ్రం వద్ద కిందపడి ప్రమాదాల బారిన పడుతున్నారని పరిసర గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే మార్గంలో బ్రిటీష్ కాలంలో నిర్మించిన చిన్న బ్రిడ్జిని సైతం మరమ్మతులకు గురిచేశారని, ఇప్పుడు అది ప్రమాదకర దశలో కూలేందుకు సిద్ధంగా ఉందన్నారు. పెద్ద ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### సీఎం సభకు గుడిపాల నుంచి 27 బస్సులు


గ్రామాలకు తరలిస్తున్న ఆర్టీసీ బస్సులు

గుడిపాల, ఫిబ్రవరి 25: శాంతిపురం మండలంలో సోమవారం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బహిరంగ సభ ఉన్నందున గుడిపాల నుంచి 27 బస్సుల్లో జనసమీకరణ చేసి పంపించేందుకు ఏపీఎం సుధారాణి, వెలుగుసీసీలు లోకనాథం రెడ్డి, హేమచంద్రారెడ్డి, మల్లీశ్వరి చర్యలు చేపట్టారు. మండలంలోని 17 సచివాలయాలు ఉండగా, 27 బస్సులను ఏర్పాటు చేశారు.

### శునకాల నివారణకు చర్యలు తీసుకోండి

● మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనిత

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 25: గ్రామాల్లో ఎక్కడ చూసినా శునకాల (వీధికుక్కలు) బెడద ఎక్కువైందని వాటి ఉత్పత్తి పెరగకుండా నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులను డిమాండ్ చేశారు. గంగాధరనెల్లూరు మండల సర్వసభ్యసమావేశం ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశపు హాలులో ఎంపీపీ అనిత అధ్యక్షతన జరిగింది. గంగాధరనెల్లూరు సర్పంచ్ సుబ్రమణ్యం మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు అప్పటి హౌసింగ్ అధికారులు త్వరలో బిల్లులు వస్తాయని చెప్పారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత బిల్లుల గురించి తెలియజేసినా ఇంతవరకు ఎందుకు ఇవ్వలేదని ఆయన ప్రశ్నించారు. మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఏకాంబరం జగనన్న లేఅవుట్స్‌కి సంబంధించి లెవలింగ్ బిల్లులు విడుదల కాలేదని అడిగారు. ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ దాము మాట్లాడుతూ మండలంలో గత ప్రభుత్వానికి సంబంధించి హౌసింగ్ బిల్లులు ఎంతమందికి రాలేదో గుర్తించి, ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామని తెలిపారు. జగనన్న లేఅవుట్స్‌కి సంబంధించి లెవలింగ్ బిల్లులు త్వరలోనే విడుదల కానున్నట్లు సమాచారం అందిందని ఆయన వివరించారు. పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో చిన్నారులు మొదలుకుని పెద్దలవరకు కుక్కలు దాడిచేసి కరిచి ఆస్పత్రుల పాలవుతున్నారని, మరికొన్నిచోట్ల పిచ్చికుక్కలు కరిచి పరిస్థితులు విషమిస్తున్నాయని తెలిపారు. ఎట్టేరి వెటర్నరీ డాక్టర్ నాగాంజనేయులు మాట్లాడుతూ కుక్కల నిర్మూలనకు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు కలిసి తిరుపతిలో ఫిర్యాదుచేస్తే వాటి సంతాన ఉత్పత్తి పెరగకుండా చర్యలు తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా మండలంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని సభ్యులు అధికారులను కోరారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ హరిబాబు, సింగిల్‌విండో త్రిమెన్ కమిటీ చైర్మన్ వేల్కూరు బాబురెడ్డి, జడ్పీటీసీ లక్ష్మిప్రియ, ఇన్‌చార్జి ఎంపీడీవో సుధాకర్, రెండవ వైస్ ఎంపీపీ బేబి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

### బ్రెయిన్ క్యాన్సర్‌తో రైల్వే కానిస్టేబుల్ మృతి

● కుటుంబసభ్యులకు రూ.25వేలు అందించిన రైల్వే పోలీసులు


జగదీష్ (ఫైల్‌ఫొటో), జగదీష్ సతీమణి భార్గవికి ఆర్థిక సాయం అందజేస్తున్న రైల్వే డీఎస్పీ షాను షేక్

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 25: పాకాల రైల్వే పోలీసు ఔట్‌పోస్టులో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న జగదీష్ (41) బ్రెయిన్ క్యాన్సర్‌తో శనివారం సాయంత్రం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామమైన రామచంద్రాపురం మండలం నత్తకుప్పం గ్రామానికి తరలించారు. ఆదివారం రైల్వే డీఎస్పీ షాను షేక్, రేణిగుంట రైల్వే ఇన్‌చార్జి సీఐ హేమసుందర్ నత్తకుప్పం గ్రామానికి వెళ్లి కానిస్టేబుల్ జగదీష్ సతీమణి భార్గవికి అంత్యక్రియల ఖర్చులకుగాను రూ.25 వేలు అందజేశారు. విధినిర్వహణలో చురుగ్గా పనిచేస్తూ అందరి మన్ననలు పొందిన జగదీష్ చిన్నవయసులోనే మృతిచెందడం తమకెంతో బాధకలిగించిందని వారు తెలిపారు.

### గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతం


గ్రూప్-2 పరీక్షలకు హాజరైన అభ్యర్థులను పరిశీలిస్తున్న పోలీసులు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 25: గ్రూప్-2 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ పరీక్షలు విజ్ఞాన్ డిగ్రీ కళాశాల, సెయింట్ మేరీస్ స్కూల్, బంగారుపాళ్యం జూనియర్ కాలేజ్, హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ పరీక్షలకు 1255 మంది హాజరు కావాల్సివుండగా, 1059 మంది హాజరయ్యారు. 196 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ సుభద్రమ్మ పర్యవేక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద సీఐ నాగ రాజరావు తమసిబ్బందితో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

### క్రీడలతో సామాజిక దృక్పథాన్ని చాటడం అభినందనీయం


స్కేటింగ్‌లో అవార్డు గ్రహీతలను అభినందిస్తున్న మంత్రి రోజా

నగరి, ఫిబ్రవరి 25: క్రీడలలో సామాజిక దృక్పథాన్ని చాటిచెప్పడం అభినందనీయమని మంత్రి రోజా పేర్కొన్నారు. ఆడపిల్లలను చదివిద్దాం.. రక్షిద్దాం, ప్లాస్టిక్ కవర్లను నిషేధిద్దాం, భూగర్భ జలాలను కాపాడుదాం, అనాథలను ఆదరిద్దాం, బాలకార్మికులను నిరోధిద్దాం అన్న నినాదాలతో రోడ్ స్కేటింగ్ చేసిన తాడిపత్రి వాసులను మంత్రి రోజా నగరిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో అభినందించారు. వజ్ర వరల్డ్ రికార్డు, హిందుస్తాన్ రికార్డు, ఏషియన్ కాంటినెంటల్ రికార్డు, వజ్ర నేషనల్ రికార్డులను సాధించిన తాడిపత్రి రమణమహర్షి అనాథ పిల్లల పాఠశాల విద్యార్థులు ఏడుగురు ఆదివారం మంత్రిని కలిసి తాము సాధించిన రికార్డుల గురించి ఆమెకు వివరించారు. క్రీడలతో సామాజిక దృక్పథం తీసుకురావడం అభినందనీయమని ఆమె తెలిపారు. మూడు రోజులపాటు 750 కి.మీ దూరాన్ని ఏడుగురు విద్యార్థులు స్కేటింగ్ చేసినట్లు కోచ్ మధు పేర్కొన్నారు.

### పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



పెనుమూరు, ఫిబ్రవరి 25: ఎక్కడెక్కడో పుట్టి పెరిగి చదువుల ఒడిలో ఒకటైన పూర్వ విద్యార్థులు చాలా కాలం తరువాత కలిసి ఆత్మీయంగా పలకరించుకుని అలనాటి తీపి జ్ఞాపకాలను పంచుకున్నారు. 1967-68 ఏడాది పెనుమూరు మండలంలోని ఉగ్రాణంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం చిత్తూరు ఎన్జీవో హోంలో ఆత్మీయ సమావేశంలో కలిశారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యం నాయుడు, రాజేంద్ర నాయుడు, వేణుగోపాల్ నాయుడు, నారాయణ, దొరస్వామి నాయుడు, రాణి, అమరావతి, రాజేశ్వరి, చిన్నస్వామి పాల్గొన్నారు.

### అబాకస్‌లో బృందావన్ విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చూపిన బృందావన్ విద్యార్థులు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 25: స్థానిక సంతపేటలోని బృందావన్ పాఠశాలలో విశ్వం ఎడ్యుకేషన్ ల్యాబ్ నిర్వహించిన అబాకస్, వేదిక్ మ్యాథ్స్ జోనల్ లెవెల్ కాంపిటీషన్‌లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనపరిచారని బృందావన్ స్కూల్ కరస్పాండెంట్ శైలజాకుమారి తెలిపారు. సుమారు 10 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా, తమ పాఠశాల విద్యార్థులు అత్యధికంగా గెలుపొందారన్నారు. వీరిని డైరెక్టర్ ప్రియతేజతో కలిసి అభినందించారు. కార్యక్రమంలో అబాకస్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

### వన్నియకుల క్షత్రియ, మొదలియార్ కులస్థుల ఆత్మీయ సమావేశం

చిత్తూరు, ఫిబ్రవరి 25: నగరంలోని డీఐ రోడ్డులో వన్నియకుల క్షత్రియ సమావేశం, సాయంత్రం ఎస్‌జీఎస్ కల్యాణ మండపంలో మొదలియార్ కులస్థుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా వైసీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి హాజరయ్యారు. వన్నియకుల క్షత్రియులు నగరంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్ రెడ్డి, కార్పొరేటర్లు వెంకట్, గణేష్, శశి, నవీన్‌కుమార్, దళవాయిపల్లె శివకుమార్, సహదేవన్, తదితరులు పాల్గొన్నారు.

### నేడు నగరపాలక కార్యాలయంలో 'స్పందన'

చిత్తూరు, ఫిబ్రవరి 25: చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు. నగరంలో సమస్యలుంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్ని సచివాలయాల్లో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యం

గుడిపాల, ఫిబ్రవరి 25: టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్ర ముఖ్యమంత్రి కావడం తథ్యమని వసంతాపురం ఎంపీటీసీ విజయలక్ష్మి జయదేవనాయుడు, సీనియర్ నాయకులు వాసుదేవ రెడ్డి అన్నారు. ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ జనసేన, టీడీపీ పొత్తుతో తొలి జాబితాలో కచ్చితంగా గెలిచే సత్తావున్న 99మంది అభ్యర్థులను ప్రకటించడం హర్షణీయమన్నారు. అధిష్ఠానం మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలతో పాటు ప్రస్తుత ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత నెలకొనడం టీడీపీ విజయానికి దోహదపడతాయన్నారు.

### బీజేపీ, వైసీపీ ప్రభుత్వాలను గద్దె దించండి: సీపీఐ


సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 25: రానున్న ఎన్నికల్లో ఓటర్లు నిరంకుశ విధానాలు అవలంబిస్తున్న బీజేపీ, వైసీపీ ప్రభుత్వాలను గద్దె దించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్. నాగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా పార్టీ శాఖ కార్యదర్శుల సమావేశం సీపీఐ నగర కార్యదర్శి వి.సి. గోపీనాథ్ అధ్యక్షతన కార్యాలయ ఆవరణలో జరిగింది. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాలను ఓడించడానికి సెక్యులర్ శక్తులన్నీ ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. అదే విధంగా సెక్యులర్ ఇండియా కూటమిని ప్రజలు ఆదరించాలని అయన కోరారు. ఈ సమావేశంలో కె. మణి, సత్యమూర్తి, డి. చంద్ర, జయలక్ష్మి, విజయ, గౌరి, విజయ్‌కుమార్, రఘు, బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఉచిత కంటివైద్య శిబిరం

పాలసముద్రం, ఫిబ్రవరి 25: పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం చెన్నైకి చెందిన ఎం.ఎన్. కంటి ఆస్పత్రి వైద్యులు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మోహనకృష్ణ పేర్కొన్నారు.